క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



నూతన యువజన సంఘం సభ్యులు

దోమ: బొంపల్లి గ్రామంలో బుధవారం జైభీం యూత్ నూతన కమిటీని స్థానిక నేతల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యువజన సంఘం అధ్యక్షుడిగా నరేష్, ఉపాధ్యక్షుడిగా మహేశ్, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కార్యదర్శులుగా కుమార్, శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయసాధనకు జైభీం యువజన సంఘం నిర్విరామంగా కృషిచేస్తుందని చెప్పారు.

హనుమాన్ మందిరంలో యజ్ఞం



యజ్ఞం చేస్తున్న నిర్వాహకులు

నవాబుపేట: మండల పరిధిలోని దాతాపూర్ గ్రామంలో హనుమాన్, శివాలయ, రామలక్ష్మణ, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన జరిగి 41 రోజులు గడిచిన సందర్భంగా ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, గ్రామపెద్దల ఆధ్వర్యంలో దేవతామూర్తులకు అభిషేకం, పుష్పాలంకరణ, బిల్వార్చణ, నైవేద్యం, మహాహారతీ అనంతరం యజ్ఞం తదితర కార్యక్రమాలను ఘనంగా జరిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని పూజలు చేశారు.

28న మెగా జాబ్‌మేళా

కొడంగల్: ఈనెల 28న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో యువజన సర్వీసుల శాఖ పర్యవేక్షణలో జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని గౌలికర్ నర్సింగ్ ఫంక్షన్ హాల్1లో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎంపిక జరుగుతుందని తెలిపారు. 60కి పైగా కంపెనీలలో 7వేలకు పైగా ఉద్యోగాలు ఉన్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదో తరగతి నుంచి పీజీ వరకు, డిప్లమా, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ, ఫాండీ, హోటల్ మేనేజ్‌మెంట్, డ్రైవర్స్, బీఈ, బీ టెక్, ఎమ్‌టెక్, ఎమ్‌బీఏ, ఎమ్‌సీఏ చదివిన అభ్యర్థులు ఒరిజినల్ ధృవీకరణ పత్రాలు తీసుకొని రావాలన్నారు. కంప్యూటర్, టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ ఇతర నైపుణ్యాలు ఉంటే వాటి సర్టిఫికెట్లు కూడా తీసుకు రావాలని చెప్పారు.


ట్రస్ట్‌సేవలు అభినందనీయం



వికలాంగులకు బస్ పాసులను అందజేస్తున్న ఆర్టీసీ డీఎం పవిత్ర, ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్

దోమ: నిరుపేదలకు సౌకర్యాల కల్పనలో స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్ పవిత్ర అన్నారు. బుధవారం మండల పరిధిలోని 500మంది వికలాంగులకు కేఎస్ఆర్ ట్రస్ట్ తరఫున డబ్బులు చెల్లించి, లబ్ధిదారులకు ఉచితంగా బస్ పాసులను అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. నిరుపేదలైన ఆ అభాగ్యులకు ఉచితంగా బస్ పాసులు ఇప్పించడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. వికలాంగులకు సేవ చేయడం గొప్ప అవకాశమని, వారిని ఎందులోనూ తక్కువగా చూడకుండా వారి ఉన్నతికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లేశం, నాయకులు అజయ్ కుమార్ రెడ్డి, ప్రతాప్ గౌడ్, లక్ష్మణ్, మల్లయ్య, పాండు, అంజయ్య, శేఖర్, జంగయ్య పాల్గొన్నారు.

చదువుతోనే లక్ష్య సాధన



దుస్తులు పంపిణీ చేసిన యాదయ్య తదితరులు

తలకొండపల్లి: చదువుకుంటే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాసరి యాదయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాతకోటతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అందజేసిన క్రీడాదుస్తులను ఎంపీటీసీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అలివేలు, జీరానాయక్, లక్ష్మణ్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ దేవులానాయక్, నాయకులు పాండునాయక్, హెచ్ఎం శ్రీలత పాల్గొన్నారు.

దిష్టిబొమ్మలా షాపింగ్ కాంప్లెక్స్!





పెద్దేముల్‌లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ (ఇన్‌సెట్‌లో) ప్రారంభోత్సవం కోసం వేసిన శిలాఫలకం

- వృథాగా దుకాణ సముదాయం
- నిర్మాణం పూర్తయినా.. స్పందించని అధికారులు
- ఏడాది గడిచినా తప్పని ఎదురు చూపులు

పెద్దేముల్: మండల పరిషత్ అభివృద్ధికి ప్రభుత్వం జెడ్పీ నిధులతో నిర్మించిన దుకాణ సముదాయం (షాపింగ్ కాంప్లెక్స్) నిరుపయోగంగా మారింది. నిర్మాణం పూర్తయి ఏడాది గడిచినా దిష్టిబొమ్మలాగే మిగిలిపోయింది. సుమారు రెండేళ్ల క్రితం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునితారెడ్డి ప్రత్యేక చొరవతో మండలానికి షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు అతిథిగృహం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. 2021 డిసెంబర్ మాసంలో దుకాణ సముదాయం నిర్మాణం పూర్తయిన సందర్భంగా ప్రారంభోత్సవం అంటూ హడావుడి చేసి పూజలు చేసిన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు.. వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో చొరవ చూపలేకపోతున్నారు. దీంతో అవి వృథాగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో ధరణి ప్రారంభం చేయడంతో షాపింగ్ కాంప్లెక్స్ డిమాండ్ పెరిగింది. దీంతో చాలా మంది దుకాణం (అడ్డా) కోసం ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్నారు. ఉపాధి లభిస్తుందని ఆశపడ్డారు. కానీ మండల అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. దీంతో దుకాణ సముదాయం ఎదుట పశువులను కట్టివేస్తుండడంతో.. పశువుల పాకగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అందుబాటులోకి తీసుకొస్తే పలువురికి ఉపాధి లభిస్తుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. భవన నిర్మాణదారునికి బిల్లు చెల్లించకపోవడం వల్లే.. అధికారులకు సదరు వ్యక్తి కాంప్లెక్స్ తాళాలను ఇవ్వడం లేదని తెలుస్తోంది.

దుకాణాలను అప్పగించాలి



దుకాణ సముదాయంపై మండల అధికారులు సరైన నిర్ణయం తీసుకోవాలి. యువతకు ఉపాధి కల్పించాలి. దుకాణాలు కేటాయించకపోవడంతో పలువురు డబ్బాలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. మండల కేంద్రాలకు వచ్చే ప్రజలు కూడా చెట్లకింద కాలం గడుపుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి షాపింగ్ కాంప్లెక్స్‌ను ఉపయోగంలోకి తేవాలి.

– నర్సింహులు, మాజీ సర్పంచ్, హన్మాపూర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



షాపింగ్ కాంప్లెక్స్‌ను త్వరగా వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు త్వరలో వ్యాపారులకు అందజేస్తాం. ఈ విషయాన్ని మండల ప్రజలు పలుమార్లు తమ దృష్టికి తెచ్చారు. సర్పంచ్‌లు కూడా తెలిపారు. త్వరలోనే ఉపయోగంలోకి తెచ్చి.. యువతకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం

– లక్ష్మప్ప, ఎంపీడీఓ, పెద్దేముల్

క్రీడలతో మానసికోల్లాసం

- మండల విద్యాధికారి రాంరెడ్డి
- కబడ్డీ, క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎంఈఓ



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎంఈఓ

కొడంగల్ రూరల్: క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసంతోపాటు స్నేహభావం పెంపొందుతుందని ఎంఈఓ కల్వకోటి రాంరెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ.. టోర్నీ ప్రారంభించి మాట్లాడారు. చదువుతోపాటు క్రీడలు ఆడడం వలన మెదడు చురుగ్గా పనిచేస్తుందని, తద్వారా ఉత్తమ మార్కులు సాధించేందుకు వీలుంటుందని చెప్పారు. నిత్యం కొంత సమయం తీసుకొని తమకు నచ్చిన ఆటలను ఆడడంతో దేహదారుఢ్యం పెంపొందుతూ ఆరోగ్యంగా ఉండేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు గణతంత్ర దినోత్సవాన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' దేశానికి ఆదర్శం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ అర్చన

పరిగి: కంటివెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని కౌన్సిలర్ అర్చన అన్నారు. బుధవారం రెండో వార్డులో కంటివెలుగును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వేంద్రియం నయనం ప్రధానమని, తొలి విడతలో నేత్ర శిబిరంతో ఎంతో మందికి కంటి సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. కావున 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు తమ కంటిచూపును పరిరక్షించుకోవాలని చెప్పారు. అందుకు కంటివెలుగు వేదికను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, చంద్రశేఖర్, యాదగిరి, అనిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దౌల్తాబాద్: కంటివెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మహిపాల్ అన్నారు. మండలంలోని బాలంపేటలో కంటివైద్య శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, కంటి సమస్య ఉన్నవారందరూ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకుడు ప్రమోద్‌రావు, ఎంపీటీసీ బసంతమ్మ తదితరులు పాలొన్నారు.

గణతంత్ర వేడుకలకు సిద్ధం

ముస్తాబైన ప్రభుత్వ కార్యాలయాలు

కొడంగల్: గణతంత్ర వేడుకల సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలను ముస్తాబు చేశారు. తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపాలిటీ, పోలీస్‌స్టేషన్ తదితర కార్యాలయాలతో పాటు విద్యాలయాలకు మామిడి తోరణాలు కట్టి, రంగురంగుల కాగితాలతో ముస్తాబు చేశారు. గురువారం ఉదయం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సిద్ధమయ్యారు. ఇదిలా ఉండగా.. రిపబ్లిక్ డే సందర్భంగా విద్యాలయాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో

తాండూరు రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 7:45 నిమిషాలకు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

మర్పల్లి: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలంటే ప్రజాస్వామ్య దేశంలో ఓటే వజ్రాయుధమని కాంగ్రెస్ పార్టీ బ్లాక్-2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం కోట్‌మర్పల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌సాగర్‌తో కలిసి నిర్వహించిన పల్లెపల్లెకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. మాజీ ఎంపీపీ నర్సింహులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ ఒక్కరికి కొత్తగా రేషన్‌కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేయాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌సాగర్, మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఖలీమొద్దిన్, సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శులు సంజీవరెడ్డి, ప్రభాకర్, మండల వర్కింగ్ ప్రసిడెంట్లు మధుకర్‌రెడ్డి, రఫి, సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో వివక్ష

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప



విలేకరులతో మాట్లాడుతున్న వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

తాండూరు: ప్రజా స్వామ్యానికి విరుద్ధంగా ఎజెండా తయారు చేశారని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప ఆరోపించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశం అనంతరం అఖిలపక్ష కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎజెండాలో భారీ బడ్జెట్ తీసుకొచ్చారు కానీ.. అట్టర్ ప్లాప్ అయిందని ఎద్దేవా చేశారు. మున్సిపల్ నిర్వహణకు ఆటంకం కలగకుండా ఉండేందుకు 36 అంశాలను ఆమోదం తెలిపామని, అయితే నిధుల కేటాయింపు మాత్రం సరిగా లేదన్నారు. ఎమ్మెల్యే మద్దతు దారులైన కౌన్సిలర్లపై చైర్‌పర్సన్ నిధుల కేటాయింపులో వివక్ష చూపించారని విమర్శించారు. దీంతో చైర్‌పర్సన్ తన గుంత తానే తవ్వుకుంటుందన్నారు. జీరో అవర్‌ను ప్రవేశ పెట్టి అన్ని అంశాలను ఆమోదం పొందేలా విశ్వ ప్రయత్నాలు చేశారని, అయినా చైర్‌పర్సన్ పాచికలు పారలేదని వెల్లడించారు. న్యాయబద్ధంగా ఉన్న అంశాలకు తాము ఆమోదం తెలిపామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సింధుజ, విజయదేవి, ఆసిఫ్, ముక్తార్‌నాజ్, మంకాల రాఘవేందర్, సంగీతాఠాగూర్, ప్రభాకర్‌గౌడ్, అస్లాం, అశ్విని గుండప్ప, వసంత, నాయకులు పట్లోళ్ల నర్సింహులు, నర్కుల నరేందర్‌గౌడ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'నా ఓటు నా భవిష్యత్తు'

పరిగి: ఓటు హక్కును ఓటరు నిజాయతీగా వినియోగించుకున్నప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సిద్ధిస్తుందని ఎంపీపీ అరవింద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్‌లు అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 'నా ఓటు నా భవిష్యత్తు-ఒక్క ఓటు శక్తి' అనే థీమ్ ద్వారా ప్రజా స్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ముగ్గుల పోటీలు, మానవహారం నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రాంబాబు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు ఉన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఊపిరి



పెద్దేముల్: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు విద్యార్థులు



మర్పల్లి: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీధర్



బంట్వారం: కోట్‌పల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ తదితరులు

- ఓటు మానవ జన్మహక్కు
- నేతల తలరాత మార్చే ఆయుధం
- ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగించుకోవాలి
- జాతీయ ఓటర్ దినోత్సవంలో తహసీల్దార్లు

మర్పల్లి: ఓటు అనే వజ్రాయుధం ప్రజాస్వామ్య దేశంలో నేతల తలరాత మార్చే బ్రహ్మాస్త్రమని, ఓటు మానవ జన్మహక్కని, అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మర్పల్లి తహసీల్దార్ శ్రీధర్ అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడారు. 21 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకుల ప్రలోభాలకు గురికాకుండా.. తమ ఓటును.. నచ్చిన వ్యక్తికి వేయాలని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఆర్ఐ మాధవరెడ్డి, పాఠశాలల హెచ్ఎంలు డాక్టర్ కృష్ణకుమార్, శ్రీశైలం, అధికారులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

బంట్వారం: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఎన్నికల్లో స్వేచ్ఛగా వినియోగించుకోవాలని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, అష్ఫక్ రసూల్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహసీల్దార్లు విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లి, మానవహారం నిర్వహించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంపై నమ్మకంతో ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా నిర్భయంగా ఓటు వేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలయ్య, ఎంఈఓ చంద్రప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చే ఆయుధం

పెద్దేముల్: ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడారు. ప్రజాస్వామ్యం వ్యవస్థకు ఊపిరి ఓటుహక్కని, ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. 18ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. దేశంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, అందుకే ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవం జరుపుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోహన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహులు, అసిస్టెంట్ నర్సింహులు, ఉపాధ్యాయులు బందెప్ప, జమీల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలో గెలుపొందిన విద్యార్థులకు తహసీల్దార్ బహుముతులు ప్రదానం చేశారు.

కార్యకర్తలకు నిరంతరం అండగా..

కుల్కచర్ల: కార్యకర్తలకు, నిరుపేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. బుధవారం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన షాబాద్ అంజిలయ్య కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు.. బుధవారం అంజిలయ్యను పరామర్శించి యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మండల మాజీ అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, రాములు, శ్రీనివాస్, భరత్ రెడ్డి, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమిలో వ్యవసాయం



బూర్గుగడ్డ ప్రాంతంలో అటవీ భూమిలో సాగుచేసిన వరి పొలం ఇదే

కొన్నేళ్లుగా కొన'సాగు'తున్న తంతు

ధారూరు: ఈ ఫొటోను చూస్తే ఓ రైతుకు సంబంధించిన వ్యవసాయ పొలం అనుకుంటున్నారు కదా.. కాదండీ, ఇది అటవీశాఖకు చెందిన భూమి. అదేంటి అడవిని నరికి వ్యవసాయానికి యోగ్యమైన భూమిగా మార్చినా అధికారులు చర్యలు తీసుకోలేదా అనే ప్రశ్న మీలో కలగవచ్చు. పంట వేసిన ప్రతిసారి ఈ ఒక్కసారి అంటూ ఆ రైతు చెప్పే మాటలకు ఫారెస్టు అధికారులు వంతపాడటం వారి వంతైంది. ఫారెస్టు ఉన్నతాధికారులకు తెలియకుండా ఏళ్ల తరబడిగా కొనసాగుతూ వస్తున్న వ్యవహారం.. బూర్గుగడ్డలో జరుగుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బూర్గుగడ్డ ప్రాంతంలో విజయరాం వ్యవసాయ క్షేత్రం పక్కనే ఈ అటవీ భూమి ఉంది. బుధవారం ఆ ప్రాంతానికి వెళ్లిన విలేకరులకు ఈ దృశ్యం కనిపించింది. కొత్తగా వచ్చిన జిల్లా అటవీశాఖ అధికారి ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి మరి.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం

విజయరాం వ్యవసాయ క్షేత్రం పక్కనే ఉన్న అడవి భూమిని సాగుచేసుకుంటున్న విషయం తమ దృష్టికి వచ్చింది. గురువారం (నేడు) క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. ఇంతకు ముందు కూడా అతను అందులో వరి వేస్తుంటే అడ్డుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశాం. ఇకముందు ఆ భూమిలోకి వెళ్లనని చెప్పి తిరిగి సేద్యం చేయడం క్షమించరాని నేరం. పక్కనే ఉన్న 20 సర్వే నంబర్ పొలం రైతు కోర్టులో స్టే తీసుకువచ్చాడని, దానిని ఆసరా చేసుకొని, అటవి భూమిని సాగు చేసుకుంటున్న రైతుపై తగిన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి వ్యవహారాలను ఉపేక్షించేది లేదు.

– అటవీశాఖ అధికారి రాజేందర్‌రెడ్డి

దర్జాగా తరలిస్తున్నారు..

- రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- ఓవర్‌లోడ్‌తో ఎర్రమట్టి లారీల పరుగు
- ధ్వంసమవుతున్న రహదారులు



జినుగుర్తి రోడ్డుపై ఎర్రమట్టి లోడుతో వెళ్తున్న లారీ

తాండూరు రూరల్: ఎర్రమట్టి మాఫియా బరితెగిస్తోంది. అడిగే వారే లేరన్నట్లుగా భారీ వాహనాల్లో రేయింబవళ్లు ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తూ అధికారులకు సవాల్ విసురుతోంది. దోచుకునే విషయంలోనూ దర్జా ఒలకబోస్తున్నట్లుగా.. లారీలో ఉన్న మట్టిపై కనీసం టార్పాలిన్ కప్పకుండా తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు మండలం జినుగుర్తి-పెద్దేముల్ మండలం తట్టెపల్లి వరకు రూ.25 కోట్లతో డబుల్‌రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. అయితే జినుగుర్తి గేటు నుంచి జినుగుర్తి గ్రామం వరకు ఆర్‌అండ్‌బీ అధికారులు నూతనంగా రెండు వరుసల రహదారిని నిర్మించారు. జినుగుర్తి నుంచి అడికిచెర్ల వరకు కంకరవేసి వదిలేశారు. అయితే నూతనంగా వేసిన రోడ్డుపై భారీ వాహనాలు అదీ అధికలోడు ఎర్రమట్టితో పరుగులు తీస్తున్నాయి. ఇదిలా ఉండగా.. గతంలో జినుగుర్తి రోడ్డు ఎర్రమట్టి లారీల ఓవర్‌లోడ్‌తో పూర్తిగా ధ్వంసమైందని, ఇప్పుడు కొత్తగా నిర్మించిన రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలతో కొత్త రోడ్డు కూడా పాడైపోతుందని గ్రామస్తులు వాపోతున్నారు. నిత్యం ఈ రహదారి గుండా వందల కొద్దీ లారీలు తట్టెపల్లి నుంచి తాండూరులో ఉన్న వివిధ సిమెంట్ కర్మాగారాలతో పాటు కర్ణాటకలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలకు ఎర్రమట్టి తరలిస్తుండడం గమనార్హం.

మా పరిధి కాదు!

గతంలో రోడ్డు అధ్వానంగా మారడంతో జినుగుర్తి రోడ్డుకోసం గ్రామస్తులు ధర్నాలు, రాస్తారోకలు చేశారు. నూతనంగా నిర్మించిన రోడ్డుపై ఓవర్‌లోడ్‌తో లారీలు వెళితే.. మరలా రోడ్డు పాడైపోతుందని స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పినా.. మా మొర ఎవరూ ఆలకించడం లేదంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఎవరూ చర్యలు తీసుకోవడం లేదని, మా పరిధి కాదంటే.. మా పరిధి కాదంటూ.. ఆర్‌టీఏ అధికారులు, పోలీసులు తప్పించుకుంటున్నారని విమర్శించారు. ఇదే విధంగా లారీలు తిరిగితే రోడ్డు త్వరగా ధ్వంసమవుతుందని, అధికారులు స్పందించి ఓవర్‌లోడ్ లారీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.